సాక్షి
వికారాబాద్
మంగళవారం । 23 । మే । 2023



అకాల వర్షం..

అకాల వర్షం రైతులను కష్టాల పాలు చేసింది. ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షం, ఈదురు గాలులకు ధాన్యం తడిసిపోయింది. 8లో▸



నిరంతర పోరాటం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. 8లో▸



'స్పెషల్ డ్రైవ్'

పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు అధికారులు, పంచాయతీలు నడుంబిగించాయి. ఈమేరకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాయి. 9లో▸

విద్యాభివృద్ధికి లిప్



ప్రభుత్వ పాఠశాలలో వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక కార్యక్రమం
- 2023– 24 విద్యాసంవత్సరం నుంచి లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం
- అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అమలుకు ఏర్పాట్లు
- రాష్ట్రస్థాయిలో ఎస్‌ఓలకు శిక్షణ పూర్తి
- త్వరలోనే జిల్లాలోని టీచర్లకు ట్రెనింగ్ తరగతులు

వికారాబాద్ అర్బన్: సర్కారు విద్యను బలోపేతం చేసే దిశగా పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్న తొలిమెట్టు మాదిరిగానే యూపీఎస్, జెడ్పీహెఎస్ పాఠశాలల్లో.. లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్)ను అమలు చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

6నుంచి 9 తరగతులకు

2023– 24 విద్యా సంవత్సరం నుంచి లిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు దీన్ని అమలు చేస్తారు. ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో 'తొలిమెట్టు'ను నిర్వహించిన విద్యాశాఖ హైస్కూల్ స్థాయి విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలనే ఉద్దేశంతో లిప్‌కు శ్రీకారం చుట్టింది. యూపీఎస్, జెడ్పీహెచ్‌ఎస్‌లలో అమలు చేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన పలువురు ఎస్‌ఓలకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పూర్తిచేశారు. త్వరలోనే వీరితో జిల్లాలోని ఉపాధ్యాయులకు ట్రెనింగ్ ఇచ్చేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సామర్థ్యాల సాధనే లక్ష్యంగా..

కరోనా మహమ్మారి కారణంగా రెండేళ్ల పాటు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించలేదు. దీంతో అత్యధిక మందిలో కనీస సామర్థ్యాలు లోపించాయి. దీన్ని సవరించేందుకు ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టును అమలు చేసిన ప్రభుత్వం విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే ప్రయత్నం చేసింది. అప్పట్లో ప్రాథమిక స్థాయిలో ఉన్న విద్యార్థులే ప్రస్తుతం 6, 7 ఆపై తరగతులు చదువుతున్నారు. వీరికి మరింత సానపెట్టే దిశగా ఈసారి లెర్నింగ్ ఇప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంను అమలు చేయనుంది. ఇప్పటికే తొలిమెట్టుతో కొంత మెరుగుపడ్డ విద్యార్థులు లిప్ కార్యక్రమంతో మరింత ప్రగతి సాధించే అవకాశముంది. ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు ద్వారా శిక్షణ పొందిన కొంత మంది విద్యార్థులు చదవడం, రాయడం, తీసివేతలు, కూడికలు వంటి వాటిలో ఇంకా పూర్తిస్థాయి నైపుణ్యం సాధించలేదని తేలింది. తొలిమెట్టు ప్రారంభమయ్యే నాటికే యూపీఎస్, హైస్కూల్‌లో ఉన్న విద్యార్థులు కూడా విద్యా సామర్థ్యాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నారు. ఇలాంటి వారందరిలో పఠన, రాత సామర్థ్యాలను పెంచేందుకు లిప్ దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

40,534 మంది విద్యార్థులు

లిప్ ద్వారా జిల్లాలో సుమారు 40,534 మంది విద్యార్థులకు మేలు జరుగనుంది. జిల్లావ్యాప్తంగా 116 ప్రాథమికోన్నత, 174 ఉన్నత పాఠశాలున్నాయి. వీటిలో సుమారు 40వేల మంది చదువుతున్నారు. ఇందులో చాలా మందికి మాతృభాషతో పాటు ప్రథమ, ద్వితీయ భాషలు స్పష్టంగా చదవడం, రాయడం వంటి సామర్థ్యాలు లేవని గుర్తించారు. ఇలాంటి వారిలో విద్యా సామర్థ్యాలు పెంచే దిశగా లిప్‌ను అమలు చేయనున్నారు. అభ్యసన పద్ధతుల ద్వారా లాంగ్వేజీలపై పట్టు సాధించేలా బోధిస్తారు. జీవశాస్త్రం, రసాయన శాస్త్రం వంటి ఆప్షనల్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెడుతారు. తొలిమెట్టు మాదిరిగానే నెల నెల సమీక్షలు, మధ్యంతర, వార్షిక పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయనున్నారు.

'తొలిమెట్టు' తరహాలోనే..



తొలిమెట్టు తరహాలోనే ఉన్నత పాఠశాల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు విద్యాశాఖ లిప్ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది.విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది. ఇప్పటికే జిల్లాకు చెందిన ఎస్‌వోలకు శిక్షణ పూరైంది. త్వరలో జిల్లాలోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

తడిసిన ధాన్యానికి బాధ్యులెవరు?

- కలెక్టర్ నారాయణరెడ్డి ఆగ్రహం
- కొనుగోళ్లు, తరలింపులో వేగం పెంచాలని ఆదేశం
- అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

వికారాబాద్ అర్బన్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో అలసత్వం తగదని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, మిల్లులకు తరలింపుపై సోమవారం ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోందన్నారు. వారం రోజులుగా కేవలం 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించి.. 4,721 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారని తెలిపారు. ఆదివారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిందని దీనికి బాధ్యులెవరని..? ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి రోజు లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ జరగాలని ఆదేశించారు. వారం పది రోజుల్లో రుతుపవనాలు రానున్న నేపథ్యంలో కొనుగోళ్లలో వేగం పెంచాలన్నారు. ఇందుకు సహకరించని మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు, గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలని సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు.

ఎన్నికల పనులు పెండింగ్ తగదు

ఎన్నికలకు సంబంధించి ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రతీ సోమవారం తమ పరిధిలోని ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ జాబితా వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా ప్రజల నుంచి వచ్చిన 216 ఫిర్యాదులను ఆయా శాఖలకు అందజేయాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. జూన్ మాసంలో విద్యా సంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన మరమ్మతులు చేయించాలని తెలిపారు. త్వరలో నిర్వహించనున్న గ్రూప్– 4 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అటెండెన్స్ యాప్‌ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ విమల, డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఓ తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు



పెద్దేముల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ రుద్రమూర్తి

పెద్దేముల్: రైతుల వేలిముద్రల ఆధారంగా ఎరువులు విక్రయించాలని, నకిలీ విత్తనాలు, మందులు అమ్మితే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. పోలీసులు, వ్యవసాయ శాఖలతో కలిసి సోమవారం మండలంలోని మంబాపూర్, పెద్దేముల్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. షాపుల్లోని స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మే వారి లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు పీడీ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు ఎస్ఐ అబ్దుల్‌రవూఫ్, పెద్దేముల్ ఏఓ నజీరొద్దీన్, కానిస్టేబుల్ మారుతితో పాటు తదితరులు ఉన్నారు.

అన్ని బ్యాంకుల్లో రూ.2 వేల నోట్ల మార్పిడి

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, గ్రామీణ, సహకార బ్యాంకుల్లో రూ.2 వేల నోట్లను మార్చుకోవచ్చునని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకుల్లో ఖాతా లేని వారు రోజుకు రూ.20,000 వరకు మార్చుకోవచ్చని, ఖాతాలు ఉన్న వారు పరిమితికి లోబడి నోట్లు జమ చేసుకోవచ్చని పేర్కొన్నారు. నోట్ల మార్పిడికి అవరమైన చిన్న నోట్లను అన్ని బ్యాంకుల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అవకాశం సెప్టెంబర్ 30 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ మధ్యకాలమంతా రూ.2 వేల నోటు మార్కెట్‌లో చలామణిలో ఉంటుందని తెలిపారు. వికారాబాద్‌లోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో నోట్ల మార్పిడి కొరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'కార్పొరేట్ ఇంటర్'కు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ఉచిత విద్యను అభ్యసించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో జూన్ 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2023 ఏప్రిల్‌లో పదో తరగతి పాసై.. 7.0 జీపీఏ పైన సాధించిన వారే అర్హులని తెలిపారు. ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, ఎయిడెడ్ స్కూళ్లల్లో చదివిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.

ఎప్పటికప్పుడు ధాన్యం తరలించండి



సాల్వీడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్డీఓ నర్సింలు

కుల్కచర్ల: రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని అడిషనల్ డీఆర్డీఓ నర్సింలు ఆదేశించారు. సోమవారం కుల్కచర్ల మండలంలో పర్యటించిన ఆయన కుల్కచర్ల, సాల్వీడు గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. సెంటర్ల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అనంతరం మహిళా సమాఖ్య కార్యాలయానికి చేరుకుని మహిళా సంఘాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఏపీఎం శోభ, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

ధారూరు: గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ చిల్కూరు సంచాలకులు కె.రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 29నుంచి నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇందుకోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. శిక్షణ కాలం 30 రోజులని, 19 నుంచి 45 ఏళ్ల వారు అర్హులని పేర్కొన్నారు. ఎస్సెస్సీ, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుబుక్ జిరాక్స్ కాపీలతో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసి అప్లికేషన్ ఇవ్వాలని సూచించారు. దరఖాస్తుదారులు విధిగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. వివరాలకు 8639079122, 7981951167, 9000778300 నంబర్లలో సంప్రదించాలి.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



ధారూరులో మాట్లాడుతున్న సీడీపీఓ వెంకటేశ్వరమ్మ

ధారూరు: గ్రామాలు, తండాల్లో జరిగే బాల్యవివాహాలపై ముందస్తు సమాచారం ఇవ్వని అంగన్‌వాడీ సిబ్బందిపై చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ హెచ్చరించారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఇటీవల అంతారం గ్రామంలో బాల్య వివాహాన్ని నిలిపివేయడంపై ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, ముందుగానే సమాచారం ఇస్తే బాగుంటుందని ఆర్ఐ వీరేశ్ అన్నారు. ఈ సమావేశంలో బాలల హక్కుల సంరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నెల్లి జనార్దన్, ఎంపీఓ షఫీయుల్లా, డిప్యూటీ తహసీల్దార్ విజయ్, ఏఎస్ఐ సంగయ్య, సూపర్‌వైజ్ శాంతబాయి, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన వీఓఏలు

- రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి
- వీఓఏల డిమాండ్
- కలెక్టరేట్ ముట్టడి

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. వీఓఏల సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు అందించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి ప్రభు, పుల్లయ్య, లాలన్న, జంగన్న, సుభాష్, ఇబ్రహీం, లక్ష్మి, పుష్ప, బాలమణి, సుజాత, కవిత, సునీత, మహేశ్వరి, మమత తదితరులు పాల్గొన్నారు.

'సీఎం క్రీడా' సంబరం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

- సందడిగా ప్రారంభమైన జిల్లా స్థాయి పోటీలు
- మూడు రోజుల పాటు కొనసాగనున్న ఆటలు
- టోర్నీని ప్రారంభించిన కలెక్టర్ నారాయణరెడ్డి



క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: జిల్లా కేంద్రంలో అధికారిక క్రీడా సంబరం మొదలైంది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని సీఎం క్రీడా కప్ పేరుతో ప్రభుత్వం ఈ ఆటల పోటీలు నిర్వహిస్తోంది. క్రీడలు, యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పోటీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే వారం రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి పోటీలు పూర్తవగా.. ఇందులో 4వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీటిలో ప్రతిభ చూపిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు.

మూడు రోజుల పాటు..

జిల్లా స్థాయిలో మూడు రోజుల పాటుపోటీలు నిర్వహించనున్నారు. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్‌తో పాటు అథ్లెటిక్స్‌లో 200 మీటర్లు,400 మీటర్ల పరుగు పందేలు నిర్వహించారు. 15నుంచి 36 సంవత్సరాలలోపు పురుషులు, మహిళలు ఇందులో పాల్గొన్నారు. మండల స్థాయిలో ఐదు క్రీడలనే నిర్వహించగా.. జిల్లా స్థాయిలో 11 రకాల పోటీలు ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో నిర్వహించిన క్రీడలకు అదనంగా జిల్లా స్థాయిలో బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఈనెల 24 వరకు జిల్లా స్థాయి పోటీలు ముగియనుండగా.. 28నుంచి 31వరకు రాష్ట్ర స్థాయిలో 18 రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తారు.

మండల స్థాయిలో మమ

మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 4 వేల మంది పాల్గొన్నట్లు అధికారులు చెబుతుండగా ఒకటి రెండు మండలాలు మినహా ఎక్కడా వంద మందికి మించి హాజరు కాలేదు. ఎండలు విపరీతంగా ఉండటం, ఆటల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం వంటి సమస్యలతో పోటీలను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. మండల స్థాయి టోర్నమెంట్ల నిర్వహణకు ఒక్కో మండలానికి రూ.15 వేల చొప్పున కేటాయించిన ప్రభుత్వం ఇప్పటికీ ఈ డబ్బులు విడుదల చేయలేదు. దీంతో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ఆటలు ఆడించిన పీఈటీలకు కనీసం భోజనం కూడా పెట్టలేదు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు టెంట్లు, కుర్చీలకు కూడా సరిపోవని తెలుస్తోంది. తమ పేర్లతో వ్యక్తిగత పోటీలు నిర్వహిస్తూ రూ.లక్షలు ఖర్చు చేస్తున్న అధికార పార్టీ నేతలు సీఎం ట్రోఫీని మాత్రం పట్టించుకోలేదు. దీంతో చేసేదేమీలేక అధికారులు పోటీలను మమ అనిపించారు.

జిల్లాకు పేరు తేవాలి

జీవితంలో యువతకు విద్య ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ప్రధానం. క్రీడలతో శరీరంతో పాటు మనసు కూడా దృఢంగా మారుతుంది. ఏదైనా సాధించగలమనే పట్టుదల, క్రీడా స్ఫూర్తి అలవడుతాయి. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తేవాలి.

– నారాయణరెడ్డి, కలెక్టర్

మాసబ్ చెరువును కబ్జా కానివ్వం

- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మాసబ్ చెరువు వద్ద ఆందోళన చేస్తున్న రంగారెడ్డి, ఇతర నాయకులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువును కాపాడే ప్రయత్నంలో జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమేనని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మాసబ్ చెరువు పరిరక్షణ సమితి, అఖిల పక్ష నాయకులతో కలిసి సోమవారం చెరువులో మట్టి డంప్ చేస్తున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. మాసబ్ చెరువు విషయమై ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను ఎవరిని ప్రశ్నించినా ఇందులో ఇన్‌వాల్వ్ కావద్దని కలెక్టర్ హరీష్ చెప్పినట్లు చెబుతున్నారని.. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులతో జీతాలు తీసుకుంటున్న అధికారులు భూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారంటూ ఆరోపించారు. కళ్లముందే చెరువు కబ్జా అవుతున్నా పట్టించుకోని అధికారులు ఉండి ఏం లాభమన్నారు. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌నుసర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలని.. అప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడటంతో పాటు మట్టిని డంప్ చేయకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోర్టు ఉత్తర్వులను అడ్డం పెట్టుకుని చేపడుతున్నటువంటి నిర్మాణాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఐలయ్య, సునీల్, రవీందర్‌రెడ్డి, మల్లేష్, శివలింగం గౌడ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేష్, బీఎస్పీ మున్సిపల్ అధ్యక్షుడు వద్దిగళ్ల బాబు, టీడీపీ అధ్యక్షులు వీరేశం, బీఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు యాదిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, యాదగిరి, దర్శన్, మహేందర్ రెడ్డి, గుత్తా మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- వైద్య సిబ్బందికి రంగారెడ్డి డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు సూచన



చేవెళ్లలోని పాలియేటివ్‌కేర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

చేవెళ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలకేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం, పాలియేటివ్ కేర్ సెంటర్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ స్టోరేజ్ కేంద్రం, రామన్నగూడలోని కంటి వెలుగు శిబిరాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో అందుబాటులో ఉన్న పాలియేటివ్ కేర్ సెంటర్ సేవలను ప్రజలు ఉపయోగించుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని, రోగులతోపాటు ఉండే అటెండర్‌కు సైతం భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లోని ఆరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో ఉన్న డయాలసిస్ పేషెంట్లను గుర్తించి చేవెళ్ల ఆస్పత్రికి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించే ఆరోగ్య పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలని తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట పలువురు వైద్యాధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

అనంతగిరి: సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను వెంటనే రెగ్యూలరైజ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలన్నారు. కేజీబీవీల్లో స్పెషల్ ఆఫీసర్ నుంచి వర్కర్ వరకు అందరూ మహిళ ఉద్యోగులే. కష్టపడి పనిచేసి అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. అయినప్పికీ ప్రభుత్వం నుంచి వారికి తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబురావు, కృష్ణవేణి, పవన్‌కుమార్, రాములు, అజయ్‌కుమార్, కృష్ణవేణి, మాధవి, జ్యోతి పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంలో బీసీలకు అన్యాయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ



అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

పరిగి: ప్రత్యేక రాష్ట్రంలోనూ బీసీలకు అన్యాయం జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ అన్నారు. సోమవారం ఆయన పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లాల్‌కృష్ణ మాట్లాడుతూ.. బీసీలను చట్టసభల్లో అడుగుపెట్టనీయకుండా అగ్రవర్ణాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలో 60శాతం బీసీ ఓటర్లుండగా ఇప్పటికీ ఒక్క బీసీ కులస్తుడు ఎమ్మెల్యే కాలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరుగుతుందనుకుంటే సీఎం కేసీఆర్ బీసీలను అనగదొక్కి సీఎం కుర్చీపై కూర్చున్నారన్నారు. బీసీ రుణాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 5.70లక్షల మంది బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకుంటే నేటికీ చిల్లిగవ్వ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో సగానికిపైగా ఎమ్మెల్యే సీట్లను బీసీలకు కేటాయించే పార్టీని గెలిపించుకుంటామన్నారు. బీసీలకు చట్టసభలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే బీసీలను ఐక్యం చేసుందుకు భారీ సభ ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ నాయకులు, బాబయ్య, డాక్టర్ జగన్మోహన్, రామస్వామి, ఆంజనేయులు, రవికుమార్ పాల్గొన్నారు.

సాధువులా వచ్చి.. బురిడీ కొట్టించి..

నందిగామ: నీ భర్తకు గండం ఉంది.. ఇంట్లో ఉన్న బంగారాన్ని బయటకు తీస్తా.. కూతుళ్ల బాగుకోసం పూజలు చేస్తా.. అని ఓ సాధువు.. మహిళను నమ్మించాడు.. మాయమాటలు చెప్పి లక్షల రూపాయలతో ఉడాయించాడు.. ఈ సంఘటన నందిగామ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మోసపోయిన సదరు మహిళ నందిగామ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈదులపల్లికి చెందిన వీ సునీత, దశరథ్‌లు దంపతులు. వీరికి ముగ్గురు కూతుళ్లు. రెండు నెలల క్రితం గ్రామానికి ఓ సాధువు వచ్చి సునీతను పరిచయం చేసుకున్నాడు. తన పేరు రాములు అని శ్రీశైలం నుంచి వచ్చానని చెప్పాడు. నీ భర్త దశరథ్‌కు గండం ఉందని, దోష పరిహారం చేయాలని, ఇందుకు రూ. 15వేలు ఖర్చు అవుతుందని చెప్పాడు. నమ్మిన ఆమె అడిగిన డబ్బు ఇచ్చింది. అనంతరం కూతుళ్ల బాగు కోసం పూజలు చేస్తానని, ఇంట్లో ఉన్న బంగారాన్ని బయటికి తీస్తానని, ఇందుకు రూ. 2.50లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. సాధువు మాయమాటలు నమ్మిన సునీత ఆ డబ్బు కూడా ఇచ్చింది. నెలరోజుల తర్వాత వస్తానని, అప్పటి వరకు ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే నీ భర్త ప్రాణాలకు హాని కలుగుతుందని భయపెట్టాడు. దీంతో ఆమె సాధువు కోసం నెల రోజుల పాటు వేచి చూసింది. ఆయన రాకపోవడంతో మోసపోయానని భావించి నందిగామ పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తులో ఉంది.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం



పెద్దేముల్: మంబాపూర్ కోనుగోలు కేంద్రం తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు

తడిసిముద్దయిన ధాన్యం

పెద్దేముల్: అకాల వర్షం అన్నదాతను కష్టాల పాలు చేస్తుంది. ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షం, ఈదురు గాలులకు ధాన్యం తడిసిపోవడంతో పాటు రహదారులపై చెట్లుకూలయాయి. చేతికొచ్చిన పంటలు పాడయ్యాయి. దీంతో రైతన్నలు ఆవేదనలో మునిగిపోయారు. గన్నీ సంచులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. గన్నీ సంచులు అందక.. సమయానికి కాంటాలు కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంబాపూర్, గాజీపూర్, మన్‌సాన్‌పల్లి, కందనెల్లి తండాతో పాటు పలు గ్రామాలల్లో కోతకు వచ్చిన పంటలు పాడయ్యాయి. తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారిపై చెట్టు విరిగి రోడ్డుపై పడటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

తాండూరు రూరల్: మండల పరిధిలో పలుచోట్ల ఆదివారం అర్ధరాత్రి వర్షం కురిసింది. గోనూరు శివారులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తడిపోయింది. ప్రభుత్వం పంట కొనుగోలు చేసి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

కవర్లు కప్పినా..

కొడంగల్ రూరల్: సోమవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి కొంత మేర వరిధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యంపై కవర్లు కప్పి ఉంచడంతో నష్టం జరగలేదు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ సోమవారం ఉదయం మండల పరిధిలోని పర్సాపూర్, పెద్దనందిగామ, అప్పాయిపల్లి, చిట్లపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. పర్సాపూర్ కాంటా చేసిన వరి ధాన్యం నిల్వ ఉందని రైతులు చెప్పారు. దీంతో ఆయన ఫోన్‌లో సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి వెంటనే లారీలను పంపించాలన్నారు. పెద్దనందిగామలో ఆరబెట్టిన ధాన్యం ఉందని చెప్పడంతో కాంట్రాక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో లారీలను పంపిస్తామని తెలిపారు. పాతకొడంగల్‌తాండాలో రోడ్డుపై కుప్ప పోసిన వరిధాన్యం తడిసి ముద్దయిందని రైతులు జాంప్యానాయక్, శీనునాయక్ తెలిపారు. కవర్లు కప్పినా గాలికి చెల్లాచెదురుకావడంతో వరిధాన్యమంతా తడిసిపోయిందని కన్నీరుమున్నీరయ్యారు. ఆయన వెంట ఏపీఎం వెంకన్న, రైతులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: పాతకొడంగల్‌తండా రోడ్డు పక్కన తడిసిన ధాన్యం చూపుతున్న రైతు



పెద్దేముల్: తాండూరు–సంగారెడ్డి రహదారిపై కూలిన చెట్టు



పెద్దేముల్: గాజీపూర్‌లో నేలకొరిగిన వరి



కొడంగల్ రూరల్: పెద్దనందిగామలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సురేశ్

పెళ్లి కుదరడం లేదని..

మనస్తాపంతో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



వెంకటేశ్ (ఫైల్)

పరిగి: పెళ్లి కుదరడం లేదని మనస్తాపం చెందిన ఓ ఏఆర్ కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలో రూప్‌కాన్‌పేట్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటేశ్(31) గచ్చిబౌలిలోని ఎంటీ సెక్షన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి ఏడాది కాలంగా కుటుంబ సభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఎంతకీ కుదరకపోవడంతో మనస్తాపానికి గురైన కానిస్టేబుల్ సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

తాండూరు టౌన్: రైలు ఢీకొనడంతో ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ ఘటన తాండూరు రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. తాండూరు రైల్వే స్టేషన్ యార్డు సమీపంలో రైలు ఢీకొనగా సుమారు 50 ఏళ్ల మహిళ మృతి చెందిందన్నారు. మహిళ ఒంటిపై నీలం, ఆకుపచ్చ రంగు పూల చీర, ఎరుపు రంగు జాకెట్ ధరించి ఉందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పూడ్చిన శవానికి పోస్టుమార్టం

పూడూరు: తన భర్త మృతిపై అనుమానం ఉన్నట్లు భావించిన భార్య సునీత చన్గోముల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, అధికారులు తెలిపిన ప్రకారం.. ఈ నెల 17న మండల పరిధిలోని కంకల్‌లో ఎర్ర వీరన్న(40) ఇంట్లోనే మృతి చెందాడు. అదే రోజు కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. అనుమానంతో భార్య 20న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సోమవారం తహసీల్దార్ మోహన్, ఎస్ఐ సత్తయ్య, వైద్యుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. రిపోర్టుల ఆధారంగా కేసు విచారిస్తామని పోలీసులు చెప్పారు.

అభివృద్ధి పనులకు భారీగా నిధులు



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు భారీఎత్తున నిధులు కేటాయిస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం ఆయన గుబ్బడి పత్తేపూర్‌లో రూ.1.45కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.45లక్షలతో సీసీ రోడ్లు, యూజీడీ పనులకు కేటాయించామన్నారు. రూ.కోటితో గుబ్బడి పత్తేపూర్ నుంచి పర్వేద పీడబ్ల్యూ రోడ్డు వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీడీఓ సుమిత్రమ్మ, పీఆర్‌డీఈ మాధవరెడ్డి, ఏఈ లక్ష్మయ్య, సర్పంచ్ విర్జినమ్మ, ఎంపీటీసీ సభ్యుడు దయాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు జూడ్సురెడ్డి, యాజూబ్ తదితరులు పాల్గొన్నారు.

'మినీ మహానాడు'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చంద్రయ్య

టీటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రయ్య

పరిగి: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23న పట్టణ కేంద్రంలోని నిర్వహించే మినీ మహానాడును విజయవంతం చేయాలని టీటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రయ్య అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 10:30 గంటలకు పరిగిలో ప్రారంభం అవుతుందన్నారు. బస్టాండ్ నుంచి శారద గార్డెన్ వరకు ర్యాలీగా వెళ్లి మహానాడు ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నాయకులు హాజరువుతారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై విజయవతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు చంద్రహాస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ మాణిక్యం, నాయకులు కాసాని వీరేశ్, కృష్ణయ్య, సాయిలు, వెంకటేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

'లక్ష్మీదేవిపల్లి' సాధనకు పోరాటం

షాద్‌నగర్ రూరల్: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో అలుపెరగని పోరాటం చేయాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ చేపట్టాలంటూ సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట అఖిలపక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ మాట తప్పారని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఈ రిజర్వాయర్‌పై చిత్తశుద్ధి లేదన్నారు. ఇటీవల సీఎల్పీ నేత భట్టివిక్రమార్క ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వాన్ని నిలదీస్తే.. స్పందించాల్సిన నాయకులు మీకు బస్సులు పెట్టి ప్రాజెక్టు నిర్మాణ పనులను చూపెడతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఎండీ ఇబ్రహీం మాట్లాడారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెంటనే పనులు చేపట్టాలి

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని అఖిల పక్షం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు తహసీల్దారు గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 72 ప్రకారం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రధాన భాగాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు రాఘవాచారి, నేతలు అర్జునప్ప, బాబర్ అలీ ఖాన్, సత్యం, రాజు, తిరుమలయ్య, రాయికల్ కుమ్మరి శ్రీనివాస్, బాదెపల్లి సిద్ధార్థ, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసు

- బయోమెట్రిక్ ఆధారంగానే అమ్మకాలు
- వ్యవసాయ శాఖ ఏడీ రుద్రమూర్తి

తాండూరు టౌన్: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించిన దుకాణదారులపై కేసులు నమోదు చేయనున్నట్లు తాండూరు డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ రుద్రమూర్తి హెచ్చరించారు. సోమవారం డివిజన్ పరిధిలోని తాండూరు టౌన్, పెద్దేముల్, మంబాపూర్ తదితర ప్రాంతాల్లోని విత్తన, ఎరువుల దుకాణాల్లో డివిజనల్ టాస్క్‌ఫోర్స్ టీంతో కలిసి తనిఖీలు నిర్వహించారు. విత్తన, ఎరువుల స్టాక్, విక్రయాల రికార్డులను, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని, మోసపూరితమైన విక్రయాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. విక్రయాలు జరిపే సమయంలో విధిగా రైతు వేలిముద్రలు తీసుకోవాలన్నారు. కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని, తప్పకుండా రశీదులు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో తాండూరు డివిజన్ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఎస్సై అబ్దుల్ రవూఫ్, పెద్దేముల్ వ్యవసాయాధికారి నజీరుద్దీన్, కానిస్టేబుల్ మారుతి పాల్గొన్నారు.

సిబ్బంది కొరతతో రైతుల ఇబ్బందులు

తాండూరు రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టోకెన్లు ఉన్న రైతుల ధాన్యమే కాంటా వేయాలనే నిబంధనతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించే ఈ టోకెన్ల కోసం రైతులు గంటల తరబడి వేచిఉన్నారు. మండల పరిధిలోని చెంగోల్, అల్లాపూర్, గోనూర్, అంతారం, మల్‌రెడ్డిపల్లి, బెల్కటూర్, నారాయణపూర్, వీరశెట్టిపల్లి, అంతారం తండా, చింతమణిపట్నం, పర్వాతపూర్ రైతుల ధాన్యం కొనుగోలుకు అధికారులు చెంగోల్, గోనూర్‌లో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాండూరు క్లస్టర్‌లో ఏడుగురు ఏఈఓలకు గాను కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. దీంతో రైతులు టోకెన్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఏడీ రుద్రమూర్తిని వివరణ కోరగా కోనుగోలు కేంద్రాల వద్దే టోకెన్లు అందజేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.



యాలాల: లక్ష్మీనారాయణపూర్‌లో ఫెర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ అరవింద్‌కుమార్

ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ

యాలాల: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని యాలాల ఎస్ఐ అరవింద్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలోని పలు ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన షాపుల్లో నిల్వ ఉన్న మందుల తేదీలు, కంపెనీల వివరాలను పరిశీలించారు. షాపుల లైసెన్సులు, నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేశారు. రైతులు విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు ఎవరైన విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఎల్లారెడ్డి, సందీప్ ఉన్నారు.



తాండూరు టౌన్: ఎరువుల దుకాణంలో రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు

ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి

బషీరాబాద్: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని బషీరాబాద్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి హెచ్చరించారు. అధీకృత విత్తన, ఎరువుల డీలర్లు ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి నడుచుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని ఎరువుల, విత్తన దుకాణాలను సోమవారం ఎస్ఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలో రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న విత్తనాల నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన విత్తనాలను విక్రయించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు.



బషీరాబాద్: ఫెర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి

కత్తులతో బెదిరించి

- వ్యక్తి కిడ్నాప్.. కలకలం
- స్థానికుల అప్రమత్తతతో చిక్కిన దుండగులు

శంకర్‌పల్లి: ప్రజల చొరవతో ఓ వ్యక్తి కిడ్నాప్ నుంచి బయట పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని జనవాడ గ్రామ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, చర్యాల గ్రామానికి చెందిన సాయికుమార్, అతని స్నేహితుడు నాగరాజు ఉదయం శంకర్‌పల్లిలోని డీఎంఆర్ గార్డెన్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. సాయంత్రం వారు బైక్‌పై ఊరికి వెళుతుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి వారిని అడ్డుకున్నారు. తాము ఫైనాన్స్ వారమని సాయికుమార్‌ను బలవంతంగా బైక్‌పై ఎక్కించుకొని వెళ్లారు. 15కిలో మీటర్ల దూరంలోని జనవాడ చౌరస్తా వద్దకు రాగానే సాయికుమార్ అక్కడి జనాన్ని చూసి బైక్ నుంచి దూకేందుకు యత్నించాడు. దీంతో నిందితులు బైక్ ఆపి సాయికుమార్‌ను కత్తులతో బెదిరించారు. బలవంతంగా బైక్‌పై ఎక్కించేందుకు ప్రయత్నించారు. గమనించిన చుట్టుపక్కల ప్రజలు, జనవాడ వాసులు కిడ్నాపర్లను అడ్డుకునేందుకు యత్నించారు. జనంపై కూడా కత్తులతో దాడికి తెగబడ్డారు. గమనించిన స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని నిందితులను పట్టుకుని చితకబాదారు. అనంతరం శంకర్‌పల్లి, నార్సింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బాధితులు సాయికుమార్, నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. అయితే సాయికుమార్‌ను ఎందుకు కిడ్నాప్ చేయాలనుకున్నది తెలియరాలేదు. ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

అనంతగిరి: సీపీఐ నాయకులు ప్రజా సమస్యల నిరంతరం పోరాడాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి బాలమల్లేశ్, కార్యవర్గ సభ్యులు బషీర్, గోపాల్‌రెడ్డి, పీర్ మహ్మద్, వెంకటేశ్, అనంతయ్య, బీరయ్య, కౌన్సిల్ సభ్యులు రాజు, వెంకటయ్య, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చెట్టుపై పిడుగు

కేశంపేట: మండలంలోని నిర్దవెల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ఇళ్ల మధ్య పిడుగు పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన దిద్దెల చెన్నయ్య ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో మంటలు వ్యాపించి చెట్టు పూర్తిగా కాలిపోయింది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



పిడుగుపాటుకు కాలిపోతున్న కొబ్బరి చెట్టు